క్లుప్తంగా

ఇండోర్ స్టేడియంలో కలెక్టర్ పరిశీలన



నెల్లూరు రూరల్: మొగళ్లపాళెంలోని ఇండోర్ స్టేడియం పనులను కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వస్తే క్రీడాకారులకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. క్రీడలకు ప్రోత్సాహాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సెట్నెల్ సీఈఓ నాగ రాజకుమారి, ఆర్డీఓ మలోల, యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ

నెల్లూరు(బృందావనం): పడారుపల్లిలోని దివ్యాంగుల కాలనీలో గల పీసీ రెడ్డి సమాజ మందిరంలో దివ్యాంగులు, మహిళలు, గిరిజనులకు ఉచిత కుట్టు శిక్షణను నిర్వహించనున్నామని క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారికి మధ్యాహ్న భోజనాన్ని అందజేయనున్నామని పేర్కొన్నారు. దాతల సాయంతో కుట్టు మెషీన్లను అందజేయనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు 99668 44510 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్‌హెచ్‌పీలు స్థానికంగా నివాసం ఉండాలి

పొదలకూరు : ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లు స్థానికంగా నివాసం ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీలు ఉంటున్నారని, ప్రభుత్వం వీరి ప్రాధాన్యతను గుర్తించి ఆయా గ్రామాల్లో స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. మండలంలో 22 హెల్త్‌క్లినిక్‌లు ఉన్నాయని, వాటి ద్వారా 54 రకాల మందులను గ్రామస్తులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు స్థానికంగా నివాసం ఉంటున్నట్లు సర్పంచ్‌లు నిర్ధారించారన్నారు. ప్రతి నిత్యం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విలేజ్ క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీలు అందుబాటులో ఉంటూ చుట్టుపక్కల నుంచి వచ్చే రోగులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మందులను అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు వైద్యాధికారి వెల్లడించారు. విలేజ్ క్లినిక్‌లలో వారు అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బుచ్చిరెడ్డిపాళెం : రోడ్డు ప్రమాదంలో చాన్‌బాషా అనే వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని జమీలా హాల్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన చాన్‌బాషా సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ క్రమంలో రోడ్డు మీద పడిన చాన్‌బాషా కాలుపై లారీ వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ఇందుకూరుపేట : మండలంలోని ముదివర్తిపాళెం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నరసాపురం వద్ద మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ బాలకృష్ణ తెలిపారు. డ్రైవర్ సందీప్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల ఉత్పత్తే లక్ష్యం

కోవూరు : పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో భాగంగా మేలుజాతి పశువుల ఉత్పత్తే లక్ష్యంగా ప్రభుత్వం ఆలోచిస్తోందని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. కోవూరు పశువైద్యశాల ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం 15 మంది రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 60 వేల పెయ్యదూడల ఉత్పత్తే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడదూడలు–ముర్రజాతి, జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిరి, సాహివాల్ జాతి పశువులతో పాల ఉత్పత్తి పెంచాలన్నారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కోసం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఏడీ సోమయ్య మాట్లాడుతూ పది ప్రాంతీయ పశువైద్యశాలల పరిధిలో పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా పశువుల ప్రదర్శన, గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

స్వచ్ఛ సింహపురికి సహకరించండి

• కమిషనర్ వికాస్ మర్మత్



పారిశుధ్యంపై సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. మూలాపేట, ఈఎస్సార్ఎం పాఠశాల, వాకర్స్ రోడ్డు, బట్వాడిపాళెం, పోలీస్ క్వార్టర్స్, సీఏఎం పాఠశాల, కోటమిట్ట మెయిన్ రోడ్డు, కలెక్టర్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. డివిజన్ల పరిధిలో పలు సమస్యలపై అందిన ఫిర్యాదులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, సిల్టు వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. వ్యర్థాలను కాలువల్లో వేయొద్దని, తడి.. పొడి చెత్త సేకరణకు దుకాణాల బయట డస్ట్‌బిన్లను విధిగా ఉంచాలని సూచించారు. దుకాణ పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే సదరు నిర్వాహకులకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఓటర్ల జాబితా సవరణపై కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో ఓటర్ల జాబితాను రూపొందించడంలో బూత్ లెవల్ అధికారులకు సహకరించాలని కోరారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాలో మార్పులు.. చేర్పులకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నారని, పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు వారికి సహకరించాలని సూచించారు. టీడీపీ నేత భువనేశ్వరిప్రసాద్, సుబహాన్‌బాషా, సీపీఎం నేతలు కత్తి శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ఏఈఆర్వోలు దేవీకుమారి, నిర్మలానందబాబా, శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, దశయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని సహించబోం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గతంలో రౌడీయిజం జరిగేదని, అయితే ప్రస్తుతం దీనికి ఫుల్‌స్టాప్ పడిందని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 23వ డివిజన్లోని చలపతినగర్‌లో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపనను మంగళవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. రౌడీయిజానికి పాల్పడితే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. రూరల్‌లోని అన్ని ప్రాంతాలు ప్రస్తుతం ఎంతో ప్రశాంతంగా ఉన్నాయన్నారు. డివిజన్లో ఇప్పటికే రూ.5.25 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేశామని పేర్కొన్నారు. డివిజన్లోని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. నగర శివారు ప్రాంతాలు నానాటికీ విస్తరిస్తున్నా, అక్కడ వసతులు కరువవుతున్నాయని, లేఅవుట్లు వేసిన వారు నిబంధనలకు విరుద్ధంగా విక్రయించడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఇక నుంచి లేఅవుట్లలో వసతులను పూర్తి స్థాయిలో కల్పించాకే అనుమతులను జారీ చేయనున్నారని స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి గానూ నివేదికలను రూపొందించామని వెల్లడించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, నేతలు పుల్లారెడ్డి, ఏసునాయుడు, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన



హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తూ కేవీఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నెల్లూరు(క్రైమ్): హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను పోలీస్ అధికారులు నిర్వహిస్తున్నారు. ద్విచక్రవాహన ప్రమాదాల్లో అధిక శాతం మంది తలకు తీవ్రగాయాలై మరణిస్తున్నారు. హెల్మెట్‌ను ధరిస్తే కనీసం గాయాలతోనైనా బయటపడేందుకు అవకాశం ఉంటుంది. ఫలితంగా చిన్నపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనచోదకులకు విస్తృత అవగాహన కల్పించి.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. ఈ క్రమంలో హెల్మెట్‌తో ప్రాణాలు భద్రం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో ట్రాఫిక్ అధికారులు చేపట్టారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను విధిగా ధరించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మరోవైపు హెల్మెట్ ధరించకపోవడంతో సంభవించే అనర్థాలు, అధిక వేగం ప్రమాదానికి మూలం అనే నినాదాలతో నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు.

ఆర్‌ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా



నెల్లూరు (టౌన్): ఎలాంటి అనుమతుల్లేకుండా హాస్టళ్లను నిర్వహిస్తున్న నారాయణ, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆర్‌ఐఓ కార్యాలయ ఎదుట ధర్నాను మంగళవారం చేపట్టిన అనంతరం ఆర్‌ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని సమర్పించారు. సదరు కళాశాలలపై విచారణ జరపాలని కోరారు. ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, నగరాధ్యక్షుడు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న వెంకటకృష్ణమూర్తి

నెల్లూరు రూరల్: జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణమూర్తి పేర్కొన్నారు. నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. యువజన, బాలకార్మికులు, మహిళల హక్కుల కోసం పాటుపడతామని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి సుంకర మల్లికార్జున్, లలితారామ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

25 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని 19 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులను ఈ నెల 25 వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆధార్ డాక్యుమెంట్ల అప్‌డేట్, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్ నమోదు, జారీ చేసేందుకు గానూ రోజుకు 50 నుంచి 75 చొప్పున లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సంబంధిత అంగన్‌వాడీ టీచర్లు, వార్డు వలంటీర్లు, మహిళా పోలీస్ సాయంతో ఆధార్‌ను నమోదు చేయాలని సూచించారు.

భక్తుల కొంగుబంగారం గంగమ్మ తల్లి



గంగమ్మ ఆలయం

• పడారుపల్లి గ్రామదేవతగా ఖ్యాతి

నెల్లూరు రూరల్: నగరానికి కూతవేటు దూరంలోని పడారుపల్లి గ్రామదేవత గంగమ్మ తల్లి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. గ్రామదేవతగా పడారుపల్లి చెరువు సమీపంలో అమ్మవారు వెలిశారు. ఎంతో పురాతనమైన ఈ ఆలయం ఇటీవల జీర్ణోద్ధరణకు నోచుకుంది. స్థానికులు, గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించి మహాకుంభాభిషేకం, మండల పూజలు, జాతరను విశేషంగా జరిపారు. ఆలయ ఆవరణలో ప్రతి ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టుకొని నైవేద్యాలను సమర్పిస్తున్నారు. పాడి పంటలతో పడారుపల్లిని సుభిక్షంగా ఉంచేందుకు అమ్మవారి ఆశీస్సులు తోడ్పడుతున్నాయని స్థానికుల నమ్మకం. విశాలమైన ప్రాంగణంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. నిర్మాణ సమయంలో గ్రామస్తులు, దాతల సహకారం మెండుగా ఉండటంతో అనతికాలంలోనే పనులు పూర్తి చేసుకొని ప్రస్తుతం నిత్య పూజలు అందుకుంటున్నారు.

దాతల సహకారంతో ఆలయాభివృద్ధి



ఎంతో చరిత్ర కలిగిన పడారుపల్లి గ్రామదేవత గంగమ్మ తల్లి ఆలయాన్ని గ్రామస్తులు, దాతల సహకారంతో ఇటీవల జీర్ణోద్ధరణ చేశాం. విగ్రహాన్ని ప్రతిష్టించి మండల పూజలు, జాతరను నిర్వహించాం. ప్రతి ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టుకొని అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తుంటారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నాం.

– కాకుటూరు శ్రీహరి, గంగమ్మ తల్లి సేవకుడు

గ్రామ సంరక్షిణి గంగమ్మ తల్లి



పడారుపల్లి గ్రామ సంరక్షిణిగా గంగమ్మ తల్లి నిత్య పూజలు అందుకుంటున్నారు. ఎంతో పురాతనమైన ఆలయంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్టించాం.

– వినుకొండ రాజీవ్‌చక్రవర్తి, ఆలయ అర్చకుడు

ఐఐటీలో జనహిత – వాత్సల్య విద్యార్థికి సీటు



నెల్లూరు(బృందావనం): భువనేశ్వర్‌లోని ఐఐటీలో సీటు సాధించిన కొండాయపాళెం రోడ్డులోని జనహిత – వాత్సల్య విద్యార్థి సాయిని మానవ సేవే మాధవ సేవ టీమ్ సభ్యులు మంగళవారం అభినందించారు. రూ.ఆరు వేల నగదు, ట్రాలీబ్యాగ్, నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. బాల్యంలో తల్లిని కోల్పోయి.. తండ్రి దూరమై నిరాదరణకు గురైన సాయి జనహిత – వాత్సల్యకు చెందిన భారతీయ విద్యా వికాస్ స్కూల్లో చదివి.. ప్రతిష్టాత్మక ఐఐటీలో సీటు సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దిన సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావును అభినందించారు. మానవ సేవే మాధవ సేవ బృంద సభ్యులు పరిమళ, రాఘవ, విశ్వనాథం, ఇందిర, కోలా రవి, వెంకటేశ్వర్లు, ముత్యాల శ్రీనివాసులు, విజయమ్మ, సురేష్, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో క్రేజీ డ్యాన్స్ షో, సంగీత విభావరి కార్యక్రమాలు మంగళవారం అలరించాయి. మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలను సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పేదలకు వస్త్రదానం, రక్తదాతలను సత్కరించారు. గాయకులు శైలజ, ప్రశాంతి, లక్ష్మి, రాజశేఖర్, ఇందుశేఖర్, పెంచలరెడ్డి ఆలపించిన గీతాలు మైమరపించాయి. రామచంద్రప్రసాద్, సుజయ్‌బాబు, బలరామయ్యనాయుడు, రాధారెడ్డి, మల్లికార్జునరావు, మధుసూదన్‌రావు, నాగరాజుయాదవ్, వైద్యులు సుధాకర్, గంగాధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



నెల్లూరు రూరల్: మితిమీరిన వేగంతో వస్తున్న బైక్ ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి మరణించిన ఘటన పొట్టేపాళెం వద్ద నెల్లూరు – జొన్నవాడ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. ఈవెంట్స్ నిర్వాహకుడిగా పనిచేస్తున్న పొదలకూరు మండలం కనుపర్తికి చెందిన ఓ యువకుడు నగరానికి వచ్చారు. ఈవెంట్ కోసం ఓ యువతిని తన బైక్‌పై తీసుకెళ్తుండగా, పొట్టేపాళెం వద్దకు వచ్చేసరికి రోడ్డు దాడుతున్న అదే ప్రాంతానికి చెందిన మీరామొహిద్దీన్ (50)ను ఢీకొన్నారు. ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన యువకుడే 108కు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకొని బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మీరామొహిద్దీన్ మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో యువతి, యువకుడూ గాయపడ్డారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. తిరుప్పావై సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. కల్కి జయంతిని పురస్కరించుకొని కల్కి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నగదును అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న దిలీప్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో జిల్లా అగ్నిమాపక కేంద్రంలో దిలీప్‌కుమార్ సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూతనందించేందుకు గానూ అగ్నిమాపక శాఖ అసోసియేషన్, సిబ్బంది సమకూర్చిన రూ.2.57 లక్షల మొత్తాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి అందజేశారు. ఏడీఎఫ్ఓ వేణుగోపాల్, అగ్నిమాపక శాఖ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ కిరణ్, జిల్లా గౌరవాధ్యక్షుడు హరిబాబు, అధ్యక్షుడు రాజేంద్ర, కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షుడు ఇలియాస్, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో లిటరరీ ఫోరం



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో లిటరరీ ఫోరంను కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ సౌజన్యంతో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కవి పెరుగు రామకృష్ణ, బాల సాహిత్యవేత్త గంగిశెట్టి శివకుమార్, డాక్టర్ దివిజాదేవి, విడవలూరు కళాశాల తెలుగు అధ్యాపకులు పద్మప్రియ, కోట పాఠశాల ఉపాధ్యాయులు సునీల్, వెంకటప్పయ్య, అరసం కోశాధికారి శివకృష్ణ, కవి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయనీదేవి వ్రతం



విశేషాలంకారంలో అమ్మవారు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

నెల్లూరు(బృందావనం): శ్రావణమాస మొదటి మంగళవారాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయనీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు సూరావఝల రఘురామ్మూర్తి, అవ్వారి వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. ధర్మకర్తల మండలి సభ్యులు మానికల నాగమణి, మల్లు రామ్మోహన్‌రెడ్డి, గూడంశెట్టి దొరబాబు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

గన్ ఫైరింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



విద్యార్థినికి అభినందన

నెల్లూరు (టౌన్): ఎన్‌సీసీ క్యాడెట్లకు నిర్వహించిన గన్ ఫైరింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి సాయిచరణి ప్రథమ స్థానంలో నిలిచిందని కేఎన్నార్ మున్సిపల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ పేర్కొన్నారు. బీవీనగర్‌లోని పాఠశాలలో విద్యార్థినిని మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యానగర్‌లోని ఎన్బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నేవీ, ఆర్మీ సీనియర్ డివిజన్, జూనియర్ డివిజన్ల క్యాడెట్లకు పోటీలను 10 ఆంధ్రా నావల్ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 21 వరకు నిర్వహించారని చెప్పారు. ఇందులో ప్రథమ స్థానాన్ని సాధించడంపై అభినందించారు. అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

30న చండీ హోమం

నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని ఈ నెల 30వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనాలనుకునే వారు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని సూచించారు.